ఎలక్షన్ వార్ 2023

అనుదినం... జనస్వరం

నిజామాబాద్-కామారెడ్డి

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

08 పేజీలు | గురువారం 26 అక్టోబర్ 2023 | www.navatelangana.com

అభ్యర్థుల ఖరారుతో వేడెక్కిన బాల్కొండ



- ప్రచారంలో దూసుకుపోతున్న గెలుపు గుర్రాలు
- భారీ సభలు వాహనాల ర్యాలీలు, పార్టీలలో చేరికలు
- ఎన్నికలవేళ జోరందుకున్న రాజకీయం

8లో..

ఉద్యోగులుగా గుర్తించినట్టా.. లేదా?



- వేతనాలు చెల్లించేదెప్పటి నుంచి..?
- దిక్కుతోచని స్థితిలో వీఆర్ఏలు

8లో..



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

అభ్యంతకర ప్రచారాలపై ఎప్పటికప్పుడు చర్యలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు ఎంసిఎంసి కమిటీ క్రమం తప్పకుండా ప్రతి రోజు సమావేశమై పెయిడ్ న్యూస్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చే ఎన్నికల ప్రచార ప్రకటనలు, సామాజిక మాధ్యమాల్లో వచ్చే అభ్యంతరకర వీడియోలు, సందేశాలు తదితర వాటిపై చర్చించి తగు చర్యల నిమిత్తం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులకు దిశానిర్దేశం చేశారు.

మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ నిజామాబాద్ జిల్లా స్థాయి సమావేశం కమిటీ చైర్మన్, జిల్లా ఎన్నికల అధికారి రాజీవ్ గాంధీ హనుమంతు అధ్యక్షతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం నిర్వహించారు.

మిగతా 7లో...

బాన్సువాడ ఎమ్మెల్యేలు

1952-57లో సంగం లక్ష్మీ బాయి
1957-62లో సీతాకుమారి
1962-67లో శ్రీనివాస్ రెడ్డి
1967-72 నుంచి
1983 వరకు ఎం. శ్రీనివాసరావు
1983-85లో కిషన్ సింగ్
1985-89లో సూర్యదేవర వెంకట
1989-94లో కత్తెర గంగాధర్
1994-04లో పోచారం శ్రీనివాస్ రెడ్డి
2004-09లో బాజిరెడ్డి గోవర్ధన్
2009-23 పోచారం శ్రీనివాస్‌రెడ్డి



మహిళకెన్నడు అవకాశం?

- అభ్యర్థి గెలుపునకు మహిళా ఓట్లే కీలకం
- బాన్సువాడ టికెట్ మహిళకు కేటాయించాలని డిమాండ్లు..

నవతెలంగాణ-నసురుల్లాబాద్

ఆకాశంలో సగం.. అవనిలో సగం.. అని మహిళల గురించి చెప్పే మాటలు బాగానే ఉన్నా.. ఆచరణలోకి వచ్చే సరికి పాటించడం లేదు. ముఖ్యంగా రాజకీయాల్లోకి రావాలన్న ఆసక్తి ఉన్నా.. అవకాశాలు లేక మహిళలు అట్టడుగునే ఉంటున్నారు. కామారెడ్డి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో చూసుకుంటే.. మొత్తం ఓటర్లలో సగటున మహిళలే ఎక్కువగా నమోదయ్యారు. ఆ మేరకు రాజకీయంగా మాత్రం వారికి ప్రధాన రాజకీయ పార్టీలు ప్రాధాన్యత ఇవ్వడం లేదు. తాజాగా జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డి జిల్లా నుంచి మహిళలకు అంతగా అవకాశం ఇవ్వకపోవడంతో మహిళ నేతలు నిరాశకు లోన వుతున్నారు.

బాన్సువాడ నియోజకవర్గానికి 1952లో సంగం లక్ష్మి బాయి, 1962లో సీత కుమారి ఎమ్మెల్యేలు గా గెలుపొందారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు మహిళ ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వకపోగా.. కనీసం ప్రధాన పార్టీలు మహిళా అభ్యర్థులకు టికెట్ ఇవ్వకపోవడంతో నియోజకవర్గంలో ఉన్న మహిళా నేతలు రాజకీయంగా ఎదగలేకపోతున్నారు.

కామారెడ్డి జిల్లాలో జుక్కల్, బాన్సువాడ, ఎల్లారెడ్డి, కామారెడ్డి నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో గత ఇరవై ఏండ్ల క్రితం జుక్కల్‌లో ఓ మహిళ ఎమ్మెల్యేగా గెలుపొందగా ఇప్పటి వరకు జిల్లా మహిళ ఎమ్మెల్యే గెలుపొందలేదు. టికెట్ సైతం కేటాయించలేదు.

దీంతో ఆయా పార్టీల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. మహిళలు సైతం స్వతంత్రంగానైనా బరిలో నిలిచే అవకాశం లేకుండా పోతోంది. దీంతో సమాజంలో మహిళలంటే వివక్ష దూరం కాలేదన్న వాదనకు తెరలేపుతోంది. శాసనకర్తలు మహిళలు ఉంటే ఆ వర్గానికి మరింత న్యాయం జరుగుతుందనేది అందరూ ఏకీభవించాల్సిన వాస్తవం. మహిళలు అంతరిక్షంలో అడుగుపెడుతున్న ప్రస్తుత ఆధునిక

మిగతా 7లో...

ఇంకా సస్పెన్సే..

- విడుదల కాని కాంగ్రెస్ పార్టీ రెండో జాబితా
- హస్తంలో అభ్యర్థుల కోసం కార్యకర్తల ఎదురు చూపు
- స్థానిక అభ్యర్థులలో నిరాశలు

నవతెలంగాణ-వర్ని

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల కోసం కార్యకర్తలు ఎదురు చూస్తున్నారు. తొలి జాబితాలో ఉమ్మడి జిల్లా నుంచి కేవలం బోధన్, ఆర్మూర్, బాల్కొండ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన ఆ పార్టీ.. తర్వాత బుధవారం రెండో జాబితా విడుదల చేయనున్నట్టు ప్రకటించింది. అయితే తాజాగా సైతం ఇంకా విడుదల చేయక పోవడంతో కార్యకర్తలు, అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా నిజామాబాద్ అర్బన్, రూరల్‌తో పాటు కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ పార్టీ ఎవరికి టికెట్ కేటాయిస్తుందో ఇంకా సస్పెన్స్ వీడటం లేదు. దరఖాస్తు



చేసుకున్న అభ్యర్థులు సైతం తమకే టికెట్ వరించనున్నట్టు ప్రచారం చేసుకుంటున్నారు.

బాన్సువాడ నుంచి కాంగ్రెస్ టికెట్ ఎవరికి వరిస్తుందో అని కార్యకర్తలు అభ్యర్థి కోసం ఎదురు చూపులు చూస్తున్నారు.

మిగతా 7లో...

అల్పహారానికి రూ.25 ఇవ్వాలి

- మధ్యాహ్నా భోజన కార్మికుల డిమాండ్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్నా భోజన కార్మికులు

అల్పాహారం పథకానికి ఒక్కో విద్యార్థికి రూ.25 కేటాయించాలని మధ్యాహ్నా భోజన కార్మికులు కోరారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో మధ్యాహ్నా భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎంఈఓ ఆఫీస్‌లో సీఆర్పీ కాశిరామ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి సాయిలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పిల్లలకు అల్పాహారం రాగి జావా మధ్యాహ్నా భోజనం అందించడం ఆహ్వానించదగ్గ విషయమని అన్నారు. అయినా వాటిని వండి పెడుతున్న కార్మికులకు కనీస వేతనం పెంచకుండా మెనూ చార్జీలు పెంచకుండా కార్మికుల ఇంటి నుంచి డబ్బులు తెచ్చి విద్యార్థులకు వండి పెట్టమనడం దుర్మార్గమన్నారు. 22 ఏళ్ల క్రితం పెంచిన 2000 రూపాయల వేతనం జీవో ఇచ్చిన బడ్జెట్ రిలీజ్ చేసిన నేటికీ కార్మికుల ఖాతాల్లో జమ చేయలేదన్నారు. ఈ పరిస్థితుల్లో 25 రూపాయలు ఖర్చయ్యే అల్పాహారానికి పది రూపాయల 50 పైసలు చెల్లిస్తామని మరింత కార్మికులకు ఆర్థికంగా దోపిడీ చేసే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. కావున అధికార యంత్రాంగం ఇప్పటికైనా ఆలోచించి అల్పాహారానికి 25 రూపాయలు మధ్యాహ్నా భోజనానికి 50 రూపాయలు రాగిజావాకు ఒక విద్యార్థికి రెండు రూపాయలు చెల్లించడంతో పాటు కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని పైవాటిని అమలు చేసేంతవరకు విద్యార్థులకు పాత పద్ధతిలోనే భోజనం వండి పెడతామని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న సోఫియా సంగీత అంజవ్వ ఎల్లవ్వ అంబవ తదితరులు పాల్గొన్నారు.

ఈజీఎస్ పనులపై వారాంతపు సమావేశం

నవతెలంగాణ-మెండోరా

మండల కేంద్రరంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఎంపీడీఓ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఉపాధి హామీ పనులపై చర్చించారు. పనులు చేపట్టే విధానాలపై అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. కూలీలకు న్యాయం చేకూరే దిశగా పనులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిఓ పూర్ణచంద్, ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గృహప్రవేశంలో పాల్గొన స్పీకర్



గృహప్రవేశంలో పాల్గొన్న స్పీకర్ పోచారం శ్రీనివాస్

నవతెలంగాణ-వర్ని

మండలంలోని శ్రీనగర్ గ్రామానికి చెందిన పూర్ణ చందర్‌రావు నూతన గృహప్రవేశ కార్యక్రమంలో మల్లారం సర్పంచ్ కన్నిరాం ఇంటి వద్ద ఏర్పాటు చేసిన దసరా పండుగ విందులో రాష్ట్ర శాసన సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పోచారం సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు. వారితో పాటు మండల నాయకులు, ప్రజాప్రతినిధులున్నారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



లింగవ్వ అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-డొంకేశ్వర్

మండలంలోని మారంపల్లి గ్రామానికి చెందిన బంగ్లా సాయరెడ్డి తల్లి లింగవ్వ మృతిచెందడంతో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి ప్రగాడ సానుభూతి తెలిపారు. అంత్యక్రియల్లో పాల్గొని స్వయంగా పాడే మోశారు.

36వ రోజుకు రిలే నిరాహారదీక్ష

నవతెలంగాణ-బోధన్ టౌన్

చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బుధవారం 36వ రోజు గ్రామస్తులు సంఘీభావంగా రిలే నిరాహారదీక్ష చేపట్టారు. రిలే నిరాహారదీక్షలో విజయ్, సుబ్బారావు దాసరి, కోసరాజు హరిబాబు, ముళ్ళపూడి సత్యనారాయణ, గోగినేని అభిలాష్, రాణంపల్లి శ్రీనివాస్, కరటూరి రామ్‌చందర్, ముళ్ళపూడి సుధాకర్, సుంకర వాసు, శ్రీకాంత్,



రిలే నిరాహారదీక్షలో పాల్గొన్న గ్రామస్తులు

పలుచోట్ల మేరా మట్టి మేరా దేశ్

నవతెలంగాణ-విలేకరుల బృందం

రెంజల్: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం 17 గ్రామ పంచాయతీల పరిధిలో మట్టిని సేకరించి అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు ఎంపీడీవో శంకర్ తెలిపారు. అనంతరం ఆ మట్టిని రాజధానికి తరలించి ఆ మట్టితో అమరవీరుల పేరుతో మొక్కలు నాటి అమరవీరులకు జోహార్లు అర్పించనున్నట్టు వివరించారు. ప్రతి గ్రామం నుంచి సేకరించిన మట్టిని ఒక కుండలో జాగ్రత్తపరిచి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీఓ గౌస్‌ఉద్దీన్, డాక్టర్ వినయ్ కుమార్, హెచ్‌వోలు శ్రవణ్ కుమార్ కరిపే రవీందర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రమీల రాణి, 17 గ్రామపంచాయతీలలోని కార్యదర్శులు, అంగన్వాడి కార్యకర్తలు, ఆశాలు, ఉపాధి హామీ సిబ్బంది, ఐకెపి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రెంజల్: మేరా మట్టి మేరా దేశ్ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలో బుధవారం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన మేరీ మిట్టి మేరీ దేశ్ (నా మట్టి నా దేశం) అమృత కలశా యాత్ర కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో బ్రహ్మానందం ఆధ్వర్యంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయం నుంచి జక్రాన్‌పల్లిలో ఉన్న అంబేద్కర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు మండల ప్రజా పరిషత్ కార్యాలయం ముందు ప్రభుత్వ మండల స్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి మండలంలోని అన్ని గ్రామాల నుంచి తీసుకువచ్చిన మట్టిని సేకరించి, ఎంపీడీవో బ్రహ్మానందం మండల స్థాయి అధికారులచే ప్రతిజ్ఞ చేయించారు. మండల కేంద్రంలోని వివిధ గ్రామాల నుండి మట్టిని, బియ్యాన్ని సేకరించి జిల్లా యూత్ వెల్ఫేర్ అధికారి శైలికి పంపించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బ్రహ్మానందం, తహసీల్దార్ ఎం.ఏ కలీం, ఆర్ఐ ప్రవీణ్, మండల పశు వైద్య అధికారి శిరీష, మండలానికి చెందిన గ్రామస్థాయి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ రూరల్: మేరా మట్టి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం నిజామాబాద్ మండలం కార్యాలయం నందు ర్యాలీ నిర్వహించారు. అమ్రిత్ కలశ యాత్రలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు మల్లేశ్, మధురిమ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



జక్రాన్‌పల్లి : మేరా మట్టి మేరా దేశ్ సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం



నిజామాబాద్ రూరల్ : మేరా మట్టి మేరా దేశ్ అవగాహన ర్యాలీ

నరసింహ స్వామి విగ్రహ ప్రతిష్టాపన

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రం శివారులోని పెద్దగుట్ట వద్ద నూతనంగా నిర్మించిన నరసింహ స్వామి ముఖద్వారం కమాన్ పైన నరసింహ స్వామి విగ్రహం ప్రతిష్టాపన కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని నరసింహస్వామి ఆలయం నుంచి డప్పు వాయిద్యాలతో పెద్దగుట్ట కమాన్ వరకు నరసింహ స్వామి విగ్రహాన్ని ఊరేగింపు నిర్వహించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య కమాన్ మధ్యలో నరసింహ స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గడ్డం స్వామి, బిఆర్ఎస్ పార్టీ రైతు విభాగం మండల అధ్యక్షుడు బద్దం రాజశేఖర్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు అంగిరేకుల మల్లేష్, రాజన్న, దశరథ్, నరసయ్య, రాజేశ్వర్, నాగరాజు, గణేష్, నర్సారెడ్డి, హనుమంతు, సాయిరాం, అంకిత్, గ్రామ అభివృద్ధి కమిటీ, ఆలయ కమిటీ ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.



నరసింహ స్వామి ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

అంగన్వాడీ యాప్‌లపై అవగాహన

నవతెలంగాణ-రెంజల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అంగన్వాడీ యాప్‌లపై అంగన్వాడీ టీచర్లకు అవగాహన కల్పించినట్టు ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రమీల రాణి తెలిపారు. బుధవారం అంగన్వాడి కేంద్రంలో మండలంలోని అంగన్వాడీ టీచర్లకు ప్రత్యేక అవగాహన కల్పించినట్లు ఆమె పేర్కొన్నారు. ప్రతి టీచర్ ఎంఎస్‌టిఎస్, పోషణ్ ట్రాకర్ యాప్‌లపై టీచర్ల తప్పు ఒప్పులను సరిచేశారు. దీంతోపాటు ప్రతి నెల ఒకటో తారీకు నుంచి 5వ తారీఖు వరకు పిల్లల బరువులను కొలిచి వారికి పౌష్టికాహారాన్ని అందించాలని ఆదేశించారు. ఎవరైతే ఈ యాప్‌ల పట్ల నిర్లక్ష్యం వహిస్తారో వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం వీరన్నగుట్ట గ్రామంలోని రెండవ అంగన్వాడి కేంద్రంలో దొంగలు పడడం వలన పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్టు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్

తహసీల్దార్ ముందు పలువురి బైండోవర్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

గత ఎన్నికల్లో ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించని పలువురిని తహసీల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు జక్రాన్‌పల్లి పోలీసులు తెలిపారు. గతంలో పేకాటరాయుళ్లను, మద్యం అమ్మకం చేసిన వారిని, పార్టీ జెండాలు వాహనాలు అతిక్రమంగా నడిపిన వారిని పలువురిని బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఎన్నికలు అయిపోయిన తర్వాత ఎవ్వరు కూడా తిరిగి ఇటువంటి తప్పులు మళ్ళీ చేస్తే రెండు లక్షల వరకు జరిమానా విధిస్తామని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీలో చేరనున్న గంగాధర్ పట్వారి



మాజీ డిసిసి చైర్మన్‌ను కలిసిన మాజీ మంత్రి

నవతెలంగాణ-బోధన్ టౌన్

బోధన్ పట్టణ మాజీ డిసిసి చైర్మన్ గంగాధర్ పట్వారిని మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఈనెల 27వ తేదీన బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు స్వయానా గంగాధర్ పట్వారి మాజీ మంత్రికి తెలియజేశారు.

పూల వర్ణం.. సద్దుల సంబురం

- నేడు ఎడపల్లిలో సద్దుల బతుకమ్మ

నవతెలంగాణ-ఎడపల్లి

రంగురంగుల పూలతో బతుకమ్మలు.. అక్కడ మహిళల ఆడే ఆటపాట, నృత్యాలను ఎడపల్లి మండల కేంద్రంలో గురువారం చూడొచ్చు. ప్రధానంగా రాష్ట్రమంతా దసరా కన్నా ముందే బతుకమ్మ పండుగ ముగుస్తుంది. కానీ.. నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలో మాత్రం దసరా పండుగ పూర్తయిన ఐదవ రోజు సద్దుల బతుకమ్మ పండుగను నిర్వహిస్తారు. ఇందుకుగాను బతుకమ్మలను నిమజ్జనం చేసే చోట ప్రజాప్రతినిధులు సైతం అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

'సుమారు 60 సంవత్సరాల క్రితం బతుకమ్మ పండుగ రోజున దేశాయి గడి నుంచి సద్దుల బతుకమ్మలను డప్పు వాయిద్యాల మధ్య తీసుకెళ్తుండగా సిపాయి మొదటిసారిగా గాలిలోకి తుపాకితో తూటాను పేల్చాడంతో ఆ తూటా సిపాయికే తగిలే ప్రమాదవశాత్తు ఆయన అక్కడికక్కడే చనిపోయాడు. సిపాయి చనిపోవడం పట్ల గౌరమ్మను ముట్టుతో చెరువులు నిమజ్జనం చేస్తే గ్రామానికి అరిష్టం తగులుతుందని భావించిన గ్రామపెద్దలు, మహిళలు ఆరోజు బతుకమ్మను ఆడలేదు. బతుకమ్మ పండుగ ఎప్పుడు జరుపుకోవాలనేది గ్రామస్తులందరూ ఏకమై దసరా అయిన ఐదవ రోజున ఎడపల్లిలో సద్దుల బతుకమ్మ జరుపుకుంటే గ్రామానికి మంచి జరుగుతుందని భావించి ఆ ప్రకారంగానే ఏండ్ల నుంచి బతుకమ్మను జరుపుకుంటున్నారు' అని గ్రామ పెద్దలు చెబుతున్నారు. దేశాయి గడి నుంచి హనుమాన్ మందిరం వరకు మహిళలు చేరుకుని అక్కడ బతుకమ్మలన్నీ ఒకే చోట పేర్చుతారు. అనంతరం మహిళలు 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో' అంటూ పాటలు పాడుతూ ఆడతారు.


బతుకమ్మ ఎమ్మెల్యే సతీమణి, మహిళలు (ఫైల్)

ఎమ్మార్పీఎస్ జిల్లా కోఆర్డినేటర్‌గా సరికెల పోశెట్టి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



ఎమ్మార్పీ ఎస్ అనుబం ధ సంస్థల జిల్లా కోఆర్డినేటర్‌గా సరికేల పోశెట్టి నియమితుల య్యారు. మందకృష్ణ మాదిగ ఆది వారం నిర్వహిం చిన సమావే శంలో కోఆర్డినేటర్‌గా నియమించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ.. 29సంవత్సరాలు నిజాయితీగా పనిచేస్తున్న పోశెట్టికి జిల్లా కోఆర్డినేటర్‌గా నియమిస్తున్నామని తెలిపారు. అందరికి అందుబాటులో ఉంటూ సహకరించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోశెట్టి మాట్లాడుతూ.. తనపై ఎంతో నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన మందకృష్ణ మాదిగకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా జిల్లాలోని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి, విహెచ్పిఎస్, ఎంఎంఎస్ అనుబంధ నాయకులందరికీ ధన్యవాదాలు తెలిపారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

- మండల వ్యవసాయాధికారి ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ-ధర్పల్లి

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని మండల వ్యవసాయాధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని రామడుగు ప్రాజెక్ట్ సహకార సంఘం పరిధిలోని రామడుగు, కేసారం, మైలారం, చల్లగరిగ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ఏగ్రేడ్ వరి ధాన్యానికి క్వింటాకు రూ.2203, బీ గ్రేడ్ ధాన్యానికి రూ.2183 మద్దతు ధర ఉందని తెలిపారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. గన్నీ బ్యాగుల, లారీల కొరత లేకుండా ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. రైతులు తమ ధాన్యాన్ని కేంద్రాల్లోకి తరలించి పూర్తి స్థాయిలో వరి ఆరబెట్టి, చెన్ని పట్టిన అనంతరం తూకం వేయించాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి ప్రవీణ్, సొసైటీ సిబ్బందితోపాటు ఆయాగ్రామాల విడిసి సభ్యులు, రైతులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వ్యవసాయాధికారి ప్రవీణ్‌కుమార్

యూసుఫ్ పరామర్శించిన కాటేపల్లి నగేష్‌రెడ్డి


యూసుఫ్‌ను పరామర్శిస్తున్న నాగేష్‌రెడ్డి

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని కులాస్‌పూర్ గ్రామానికి చెందిన డీసీసీ డెలిగేట్ యూసుఫ్ అల్లుడు ఇటీవల మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులను బుధవారం కాటేపల్లి నాగేష్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట మోపాల్ మాజీ మండలాధ్యక్షులు, మాజీ ఎంపీటీసీ రవి, ఎస్టీ సెల్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి, డీసీసీ డెలిగేట్ సుధాకర్, ఎంపీటీసీ నర్సయ్య, ఎన్ఎస్‌యుఐ రూరల్ అధ్యక్షులు ఆశీష్, నారాయణ, రమేష్, ఊమేష్, సాయిలు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

శోభాయమానంగా దుర్గాదేవి ఊరేగింపు

నవతెలంగాణ-బోధన్

శరన్నవరాత్రి ఉత్సవాల సంద ర్భంగా గత 11 రోజులుగా పూజలందుకున్న దుర్గాదేవి శోభాయాత్రను బుధవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం నిమజ్జనం చేపట్టా రు. సాలూర మం డల కేంద్రం లో, బోధన్ మండలం లోని పెంటాఖుర్దులో దేవి ప్రతిమలను ట్రాక్టర్‌పై అలంకరించి ఘనంగా ఊరేగించారు. సాలూర మండలంలో మహిళలు భక్తి గీతాలకు కోలాటం ఆడుతూ అలరించారు. సార్వజనిక్ దుర్గాదేవి ఉత్సవ కమిటీ ప్రతినిధులు, గ్రామపెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని ఊరేగింపు నిర్వహించారు. గ్రామపెద్దలు బుద్దె రాజేశ్వర్, గాండ్ల రాజేశ్వర్, కండెల సంజీవ్, శివకాంత్, సొసైటీ చైర్మెన్ జనార్దన్, ఐడీసీఎంఎస్ డైరెక్టర్ రాజాగౌడ్, మైదపు నాగరాజు, పెంటాఖుర్దులో సాయిపటేల్ తదితరులు పాల్గొన్నారు.


సాలూరాలో దుర్గామాత శోభాయాత్ర


బోధన్ : పెంటకుర్దులో దేవి ఊరేగింపు..

మేరా మట్టి.. మేరా భారత్


అధికారులకు మట్టి, బియ్యం అందజేత

నవతెలంగాణ-విలేకరుల బృందం

వర్ని : మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో మేరా మట్టి మేరా భారత్ కార్యక్రమంలో భాగంగా బుధవారం అమృత్ కలషా యాత్ర ర్యాలీని చేపట్టారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి మట్టిని, బియ్యంను సేకరించి అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బషీరోద్దీన్, ఎంపీవో చందర్, మెడికల్ ఆఫీసర్ డా.ప్రసన్న, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్లకు సన్మానం...



జవాన్లను సన్మానిస్తున్న అధికారులు

మండల కేంద్రంలో ఎంపీడీఓ నీలావతి ఆధ్వర్యంలో మేరా మట్టి మేరా భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీ నుంచి మట్టి, బియ్యంను సేకరించారు. అనంతరం చందూర్ గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్లను శాలువాలు కప్పి సన్మానించారు. భారత దేశ చరిత్ర గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో తారాచంద్, డిప్యూటీ తహసీల్దార్ అసీమ బేగం, ఆర్ఐ భారతి, అంగన్‌వాడి సిబ్బంది తదితరులున్నారు.

ఎడపల్లి : మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మేరా మట్టి మేరా దేశ్ ర్యాలీ కార్యక్రమాన్ని నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులు పాల్గొని ర్యాలీ నిర్వహించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయం నుంచి ఎడపల్లి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా పాదయాత్ర చేస్తూ దేశ సాంస్కృతి విశిష్టతపై ఎడపల్లి ఎంపీడీవో గోపాలకృష్ణ వివరించారు. అన్ని వర్గాల ప్రజలతో కలిసిమెలిసి సోదర భావంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది, తహసీల్దార్ మోతిసింగ్, డిప్యూటీ ఎమ్మార్వో సంధ్య, స్థానిక ప్రజాప్రతినిధులు యువకులు మహిళలు ర్యాలీలో పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు ఎమ్మెల్యే పరామర్శ


మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని తనకుర్తి మాజీ సర్పంచ్ కూచన్‌పల్లి జలంధర్‌రెడ్డిని, కూచన్‌పల్లి సాయరెడ్డిని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, నుడా చైర్మన్ ఈగ సంజీవరెడ్డితో కలిసి బుధవారం పరామర్శించారు. కొన్ని రోజుల క్రితం జలంధర్‌రెడ్డి తల్లి మృతి చెందడంతో ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మెన్ సాంబారి మోహన్, మాజీ ఎమ్మెల్సీ విజి.గౌడ్, బోర్గం పిఎసిఎస్ చైర్మన్, ఎన్‌డిసిసి బ్యాంక్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ లతా భూషణ్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మోసిన్ ఖాన్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతోనే మూడోసారి అధికారంలోకి వస్తాం

- రాష్ట్రాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసింది కేసీఆర్
- కాంగ్రెస్, బీజేపీలవి బూటకపు వాగ్దానాలు
- రూరల్ ఇంచార్జి విజి గౌడ్


మాట్లాడుతున్న వీజీగౌడ్

నవతెలంగాణ-ధర్పల్లి

ప్రత్యేక రాష్ట్రం అనంతరం జరుగుతున్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి గత తొమ్మిదిన్నర సంవత్సరాలుగా కొనసాగుతున్న సంక్షేమ పథకాలే మూడవసారి అధికారంలోకి తేనున్నాయని నిజామాబాద్ రూరల్ బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని ఎంపిపి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొట్లాడితెచ్చిన రాష్ట్రాన్ని కేసీఆర్ అన్నివిధాలా అభివృద్ధి పథంలో నడిపారని అన్నారు. దేశంలోనే ఎక్కడా అమలుకాని సంక్షేమ పథకాలను తెలంగాణ ప్రజలకు అందించిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీల బూటకపు వాగ్దానాలు రాష్ట్ర ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని, కాంగ్రెస్, బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఇక్కడ ఇస్తామంటున్న పథకాలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. కేవలం ఎన్నికల కొరకు అబద్ధపు వాగ్దానాలు చేసి గద్దె నెక్కిన తర్వాత మోసం చేసే నైజం ఆపార్టీలదని అన్నారు. నిన్న గాక మొన్న కర్ణాటకలో అబద్ధపు వాగ్దానాలు చేసి కేవలం 5 గంటలు మాత్రమే కరెంటు ఇస్తున్నారని, ఇస్తామన్న పథకాలు ఏవికూడా అమలు పర్చడం లేదని విమర్శించారు. అందుకే కేసీఆర్ చేసేదే చెప్పుతారని తెలిపారు. నేడు రాష్ట్రంలో రైతుబంధు, రైతుబీమా, పెన్షన్, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్‌ఫండ్, కేసీఆర్ కిట్, దళిత బంధు, బిసి బంధు, మైనారిటీ బంధు ఇలా అనేక పథకాలు ప్రవేశపెట్టి ప్రజలను ఆదుకున్నది కేసీఆరేనని తెలిపారు, బీడు పడ్డ తెలంగాణను నేడు ధాన్యపు కర్మాగార తెలంగాణ దిశగా మార్చిన కేసీఆర్, నాడు దేశంలో పంజాబ్ రాష్ట్రంలో 40 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం అక్కడి రైతులు పండిస్తే, నేడు తెలంగాణ రైతాంగ 3కోట్ల మెట్రిక్ టన్నుల పంటను దిగుబడి చేస్తున్న తెలంగాణగా మార్చిన మహా మనిషి కేసీఆర్ అని అన్నారు. ఇందుకు చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు, అభివృద్ధి ద్వారానే ఇంతటి అభివృద్ధిని సాధించగలిగామని అన్నారు.

కాంగ్రెస్ 6 గ్యారంటీల పేరుతో మోసం చెయ్యాలని చూస్తుందని ప్రజలు నమ్మవద్దని సూచించారు. రూరల్ నియోజకవర్గానికి ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఎంతో సేవ చేశారని, స్థానికుడైన ఆయనకు అధిష్టానం మరోమారు అవకాశం ఇచ్చిందని గోవర్ధన్‌కు మరోసారి రూరల్ ప్రజలు ఆశీర్వదించి మరింత అభివృద్ధి సాధించుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ నల్ల సారిక హన్మంత్‌రెడ్డి, సర్పంచ్ ఆర్మూర్ పెద్ద బాలరాజ్, సొసైటీ చైర్మెన్ మల్లికార్జున్, ఎస్పీ లింగం, రంజిత్, సురేందర్‌గౌడ్, పోతరాజు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.


ప్రచారంలో పాల్గొన్న జీవన్‌రెడ్డి

గులాబీ పార్టీకి కంచుకోట

ఉమ్మడి నిజామాబాద్

- ప్రజా ఆశీర్వాద సభలో
- ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా గులాబీ పార్టీకి కంచుకోట అని నిత్యం ప్రజల్లో ఉంటూ అభివృద్ధి పనులు చేసినామని స్థానిక ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు.

మండలంలోని పిప్రి గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు, యువకులు పెద్దఎత్తున సభకు హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేండ్ల కాలంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రతి ఇంటింటికి చేరినాయని ప్రజల నుంచి బిఆర్ఎస్‌కు వస్తున్న స్పందనను చూసి ప్రతిపక్ష పార్టీలు కుదేలవుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆశాపురం దేవి శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ సోమ హేమంత్‌రెడ్డి, ఎంపీటీసీ సమర సురేష్, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేస్తా

- ఆర్మూర్ కాంగ్రెస్ అభ్యర్థి వినయ్ రెడ్డి


ప్రచారం నిర్వహిస్తున్న వినయ్‌రెడ్డి


నవతెలంగాణ-మాక్లూర్

తనకు అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని ఆర్మూర్ కాంగ్రెస్ అభ్యర్థి పి.వినయ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మానిక్‌భండార్, మానిక్‌భండార్ తండా, అమ్రాద్, ఒడ్యాట్‌పల్లి, మదన్‌పల్లి గ్రామాల్లో గడపగడపకు తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ పథకాలను వివరిస్తూ చేతి గుర్తుకి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని గ్రామ ప్రజలను కోరారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో భారీ ఎత్తున బీజేపి, బీఆర్ఎస్ పార్టీ నుంచి నరసన్నొల్ల లక్ష్మణ్, బేగరి మురళి, సంపత్, వినోద్, దీక్షిత్, సతీష్, మనోహర్, సంజయ్, నరేష్, కరణ్, డీజే రాజు, శంకర్, అంజాద్, విష్ణు, రాజేష్, రంజిత్, దినేష్, శశాంక్, భూశన్, ప్రవీణ్, సిహెచ్ నవీన్, అస్లం అబ్బాస్, అఖిల్, శంకర్, నిఖిల్, ప్రణయ్, హరితేజ, దినేష్, సురేందర్, వీరితో పాటు 50 మంది, అమ్రాద్‌లో 100 మంది యువకులు వీరికి కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వినయ్‌రెడ్డి పార్టీ కండువా కప్పి సాధారణంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వినయ్‌రెడ్డి సతీమణి అనన్య, మండల అధ్యక్షులు రవి ప్రకాష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేశ్వర్ రావు, జిల్లా నాయకులు గంగాధర్‌గౌడ్, డేగ పోషెట్టి, కంటాజి రాజేశ్వర్, పురుషోత్తం, జైల్‌సింగ్, మైనార్టీ మండల అధ్యక్షులు అలిం, శివ కృష్ణ, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

బోధన్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తా

- అమర్‌నాథ్ బాబు

నవతెలంగాణ-బోధన్‌టౌన్


మాట్లాడుతున్న అమర్‌నాథ్‌బాబు

బోధన్ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తానని పెంటఖర్దు సొసైటీ చైర్మన్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హస్తకళల చైర్మన్ అమర్‌నాథ్ బాబు తెలిపారు. బుధవారం పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా వద్ద అతని వ్యవసాయ క్షేత్రంలో మీడియాతో మాట్లాడుతూ.. బోధన్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని చెప్పారు. ప్రజా అభిప్రాయ సేకరణ చేసి ప్రజల్లోకి వెళ్తానన్నారు. ఒక్కొక్కరి ఆలోచనా ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతో మరో మహాప్రస్థానానికి నాంది కావాలన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బోధన్ నియోజకవర్గం నుంచి అభ్యర్థిగా రంగంలోకి దిగాలన్న ఆలోచన ఉందని తెలిపారు. అందరి బాగు కోసం, మన పిల్లల భవిష్యత్తు కోసం, బోధన్ నియోజకవర్గం అభివృద్ధి కోసం వినియోగపడాలన్నారు. అయితే 4 దశాబ్దాలు పడిన కష్టంతో ప్రజల అండతో ఎదిగి ప్రజలమదిలో ఒదిగి సత్ఫలితం సాధించాలన్నదే తన సంకల్పమని చెప్పారు. ప్రజల్లో తన నిజాయితీ, అంకిత భావంతో పనిచేసేతత్వం తెలుసునని వివరించారు. ప్రతి క్షణం, ప్రతి చెమట బొట్టు, ప్రతి రక్తం చుక్క మీకు ఉపయోగపడాలన్నదే నా దృఢ సంకల్పమని చెప్పారు. అభివృద్ధికి అవసరమైన అన్ని వనరులు, వసతులు బోధన్‌లో ఉన్నాయని చిత్తశుద్ధి ఉంటే దశాబ్ది కాలంలో బోధన్ యూరప్, అమెరికా దేశాల జీవన స్థితిగతులు ఉండేలా అభివృద్ధి చేయవచ్చునని తెలిపారు. తన అనుభవం, శక్తియుక్తులే కాదు అవసరం అయితే ప్రాణాలను సైతం లెక్కపెట్టక అంకిత భావంతో పనిచేసే ధైర్యం నాదని వివరించారు. ఆత్మగౌరవం నిలబడాలని, సమాజంలో మనందరం తల ఎత్తుకుని సగర్వంగా ముందుకెళ్ళాలని, మీ నిర్ణయమే నాకు శిరోధార్యమని చెప్పారు. ప్రజల అభిప్రాయాల మేరకే బోధన్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని తెలిపారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత

నవతెలంగాణ-డిచ్‌పల్లి



ఇందల్‌వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గన్నారం గ్రామానికి చెందిన పాత్రికేయుడు ఎర్ర గంగ నర్సయ్యకు చెందిన మొబైల్ ఫోన్ వారం రోజుల క్రితం ఎక్కడో పోగొట్టుకోవడంతో నర్సయ్య వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిలో భాగంగా ఎస్ఐ మహేష్ సీఈఐఅర్ పోర్టల్‌లో నమోదు చేశారు. దీంతో ఫోన్‌ను పట్టుకుని ఎర్ర గంగానర్సయ్యకు అప్పగించారు.

యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా జిషాన్

నవతెలంగాణ-భీంగల్

పట్టణ కేంద్రానికి చెందిన మహమ్మద్ జిషాన్‌ను యువజన కాంగ్రెస్ మండల కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు బాల్కొండ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు నాగేంద్రబాబు నియామకపత్రాన్ని జిషాన్‌కు అందజేశారు. నాగేంద్రబాబు మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో భీంగల్ పట్టణ అధ్యక్షులు జె.జె.నర్సయ్య, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు వాక మహేష్, భీంగల్ మండల ప్రధాన కార్యదర్శి సుంకరి సురేష్, తోట సతీష్, పొల్సాని రంజిత్, గోపి, సురేష్ పాల్గొన్నారు.


కాంగ్రెస్‌లో చేరుతున్న పలువురు యువకులు

సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌కు శ్రీరామరక్ష



మాట్లాడుతున్న ప్రశాంత్‌రెడ్డి

- మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

నవతెలంగాణ-నవీపేట్

తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న కెసిఆర్ సంక్షేమ పథకాలే శ్రీరామ రక్షగా బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తుందని మంత్రి ప్రశాంత్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో వ్యక్తిగత కారణాలతో బంధువుల ఇంటికి వచ్చిన సందర్భంగా విలేకరులతో బుధవారం మాట్లాడారు. కెసిఆర్ సంక్షేమ పథకాలతో జిల్లాలో ఐదు నియోజకవర్గాలను గెలవనున్నట్లు ఆశాభావం వ్యక్తం చేశారు. బోధన్‌లో షకీల్ ఆమీర్ గెలుపు ఖాయమని మెజార్టీ కోసం ప్రయత్నిస్తున్నారని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టో ప్రజలను మరింత ఆకర్షించిందని తెలంగాణ రాష్ట్రంలో పేదలు, బడుగులు, అభాగ్యులు, రైతులు ఎంతో సుఖ సంతోషాలతో ఉన్నారని మూడోసారి రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ప్రజలకు మరింత సంక్షేమాన్ని అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఏటీఎస్ శ్రీనివాస్, రామ్‌రెడ్డి, రమణారెడ్డి, డాక్టర్ జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరేడ్ గ్రౌండ్‌లో ఓపెన్ హౌజ్





ఓపెన్‌హౌస్‌లో వస్తువుల ప్రదర్శన..

నవతెలంగాణ-కంఠేశ్వర్

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా (ఫ్లాగ్ డే సందర్భంగా) బుధవారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ శింగెనవార్ ఆదేశాల మేరకు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఓపెన్ హౌజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ముందుగా పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ శింగెనవార్, బి.ఎస్.ఎఫ్ కమాండెంటు ఆర్.ఎస్.బాటీ ఓపెన్ హౌజ్ కార్యక్రమాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ ఆన్లైన్ ఓపెన్ హౌజ్ కార్యాక్రమంలో 303 రైఫిల్, ఎస్.ఎల్.ఆర్, ఇన్సాస్, ఎ.కె.47, 9ఎమ్.ఎమ్ కార్బన్, గ్యాస్‌గన్, యాంటి రైడ్ గన్, పిస్టల్, రివాల్వర్, గ్రెనేటు, ఎల్.ఎమ్.జి, బాంబు స్క్వాడ్ గుర్చి క్షుణ్ణంగా తెలియజేశారు. ఈ ఓపెన్‌హౌజ్ కార్యక్రమంలో అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఎ.ఆర్) గిరిరాజు, నిజామాబాద్ ఎ.సి.పి కిరణ్ కుమార్, రిజర్వు ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు షకీల్ పాషా తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం..

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా బుధవారం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లోని ప్రశాంతి నిలయంలో రక్తదాన శిబిరం కార్యాక్రమాన్ని ఉదయం 11 గంటలకు నిర్వహించగా ముఖ్య అతిథులుగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ శింగెనవార్ హాజరయ్యారు. ఈ రక్తదాన శిబిరంలో దాదాపు 27 మంది పోలీస్ సిబ్బంది రక్తదానం చేశారు. జిల్లా ప్రభుత్వ హాస్పటల్ బ్లడ్ బ్యాంక్ డాక్టర్ ఉమాదేవి (పాథాలజిస్టు), డాక్టర్ ఇమ్రాన్ అలీ, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు షకీల్ పాషా, స్పెషల్ పార్టీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి..

- కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాయమాటలను నమ్మొద్దు
- రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తొమ్మిదిన్నర ఏళ్ళలో గతంలో ఎవరూ చేయనంతగా కోట్లాది రూపాయలతో నిజామాబాద్ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసినట్లు టీఎస్‌ఆర్టీసీ మాజీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తెలిపారు. ఎన్నికల సమయంలో కొందరు కొత్త బిచ్చగాళ్లలాగా మీ వద్దకు వచ్చి మాయమాటలు చెబుతారని వాటిని ఏమాత్రం నమ్మవద్దని ఆయన ప్రజలను సూచించారు. అభివృద్ధిని చూసి ఓటేయాలని ఆయన కోరారు. బుధవారం నగరంలోని తన నివాసగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో ఎమ్మెల్సీ కవిత, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో అన్ని గ్రామాలు, గిరిజన తండాలకు బీటీ రోడ్లు వేశామన్నారు. ఇజ్రాయిల్ టెక్నాలజీతో నిర్మిస్తున్న మంచిప్ప రిజర్వాయర్ పూర్తయితే బీడు భూములకు సాగునీరందుతుందన్నారు. డిచ్‌పల్లి నుంచి నిజామాబాద్ వరకు రహదారి విస్తరణ, సెంట్రల్‌లైటింగ్‌తో డివైడర్ మధ్య రకరకాల మొక్కల పెంపకం అందరినీ ఆకట్టుకుంటుందన్నారు. డిచ్‌పల్లిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ధర్పల్లిలో వంద పడకల ఆస్పత్రి, చీమన్‌పల్లిలో పీహెచ్‌సీ, చెక్‌డ్యామ్‌లు, వంతెనలు, సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీలు నిర్మించినట్లు తెలిపారు. జిల్లాలోనే ఎంతో ప్రసద్ధి చెందిన చారిత్రక డిచ్‌పల్లి ఖిల్లా రామాలయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. పర్యాటలకు సకల సౌకర్యాలు ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.63కోట్ల నిధులతో చేపట్టిన మాధవనగర్ రైల్వే ఓవర్‌బ్రిడ్జి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు. ఆర్‌వోబీ నిర్మాణం పూర్తయితే నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనదారులకు ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ఇతర అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇప్పటి వరకు కేవలం మొదటి విడత దళితబంధు పంపిణీ చేశారని, కేవలం రూరల్ నియోజకవర్గంలో 1109 మంది లబ్ధిదారులకు రెండు విడతలుగా దళితబంధు పంపిణి చేసినట్లు ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తెలిపారు. అలాగే 3వేల మందికి గృహలక్ష్మి కింద ఇంటి నిర్మాణం కోసం మంజూరు పత్రాలు అందజేశామన్నారు. వీటికి తోడు రైతుబంధు, పించన్లు, కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, రైతుబీమా, గొర్రెల పంపిణి తదితర పథకాలకు రూ.1500 కోట్లకు పైగా నిధులు వెచ్చించినట్లు ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ వివరించారు.

అక్కపై దాడి చేసిన చెల్లెలు అరెస్టు

నవతెలంగాణ-ఆర్మూర్

పాత కక్షలను మనసులో పెట్టుకొని సొంత అక్కపై దాడి చేసి గాయపరిచన చెల్లెలిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఆర్మూర్ పోలీసులు బుధవారం తెలిపారు. వివరాలోకి వెళ్తే.. పెర్కిట్‌లో నివాసం ఉండే అక్క శ్రావణి, ఆర్మూర్ మామిడిపల్లి చౌరస్తా సమీపంలో నివాసం ఉండే ఖాందేష్ సౌమ్య అక్కా, చెల్లెండ్లు. డబ్బులు అవసరం ఉన్నప్పుడు అక్క శ్రావణి వద్ద చెల్లెలు సౌమ్య తీసుకుంటూ వచ్చింది. హుస్నాబాద్ కాలనీలో కూలిపోయిన పాత ఇంటిని పున్ణనిర్మాణం చేపట్టడానికి రూ.15లక్షల ఆర్థిక సహాయం చేయాలని అక్క శ్రావణి, బావ విటోభలను కోరింది. అంత డబ్బు ఇవ్వడానికి వారు నిరాకరించారు. మళ్ళీ మళ్ళీ డబ్బులు అడగడంతో ఇంకోసారి డబ్బుల విషయంలో తమవద్దకు రావొద్దని తేల్చి చెప్పారు. అప్పటి నుంచి అక్క, బావలపై కోపం పెంచుకుంది. మూడేళ్ళ నుంచి ఇరు కుటుంబాల మధ్య రాకపోకలుగాని, మాటలుగాని లేవు. మేనత్త కొడుకు నిశ్చితార్థం ఉండటంతో సౌమ్య బాలాజీ ఫంక్షన్ హాలుకు వచ్చింది. అదే ఫంక్షన్‌కు ఆమె అక్క, బావలు రావడాన్ని గమనించి డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో బావపై ఖాందేష్ సౌమ్య దాడి చేయబోగ అక్క అడ్డుపడింది. అడ్డు వచ్చిన ఆమెపై దాడి చేసి బలంగా నెట్టివేయడంతో తలకు బలమైన దెబ్బలు తగిలి అపస్మారక స్థితిలోకి వెళ్ళిపోయింది. వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు ఖాందేష్ సౌమ్యపై కేసు నమోదు చేసుకొని అరెస్ట్ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరిన యువకులు



నవతెలంగాణ-బాల్కొండ

బాల్కొండ మండల కేంద్రం, మండలంలోని వివిధ గ్రామాల నుంచి పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముఖ్యంగా అన్వర్ బీఆర్ఎస్ మండల మైనారిటీ ప్రధాన కార్యదర్శి, బీఆర్ఎస్ నాయకులు మాజీ సర్పంచ్ కాల మోహన్ ఆధ్వర్యంలో దాదాపు 500ల మంది యువకులు బుధవారం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ముత్యాల సునీల్ కుమార్ మాట్లాడుతూ.. ప్రశాంత్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీకి అంతం మొదలైందని బాల్కొండ గడ్డ మీద కాంగ్రెస్ జెండా ఎగరబోతుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన ప్రతీ కార్యకర్తను కడుపులో పెట్టుకొని కాపాడుకుంటానని తెలిపారు. కేసీఆర్ కాంగ్రెస్ పార్టి మేనిఫెస్టోను కాపి కొట్టారని వాళ్ల మాటలను నమ్మే పరిస్థతిలో ప్రజలు లేరని తెలిపారు. వీళ్ల అరాచకాలను అంతం చేసే బాధ్యత బాల్కొండ నియోజకవర్గ యువత తీసుకోవాలని సూచించారు. ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ గెలుపును ఎవరూ ఆపలేరని కార్యకర్తలు 30 రోజులు అవిశ్రాంతంగా కష్టపడాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో అన్సారీ, ఇమ్రాన్, ఆసిఫ్, అజ్జు, సుమిర్, శెఫి, ఉమర్, ఆరిఫ్, మున్నిర్, రిజ్వాన్, విక్రమ్, శేఖర్, రాజ్‌కుమార్, ఇలియాస్, రఘు, గ్గౌస్ అజీమ్ తదితరులు ఉన్నారు. మండల పార్టీ అధ్యక్షులు వెంకటేష్ గౌడ్, ప్రవీణ్ గౌడ్, శ్రీను గౌడ్, కుందారపు శ్రీనివాస్, యునుస్, విక్కి, సతీశ్ ఉమ్మడి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు దసరా శుభాకాంక్షలు తెలిపిన మాజీ వైస్ ఎంపీపీ



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు జక్రాన్‌పల్లి మాజీ వైస్ ప్రెసిడెంట్ జితేందర్ దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే నివాసంలో బాజిరెడ్డి గోవర్ధన్‌ను కలిసి జితేందర్ నాయక్ దసరా శుభా కాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తాజా రాజకీయాలపై మాట్లాడారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఘనపూర్ గ్రామానికి చెందిన కొక్కుల గంగాధర్ 57 మద్యానికి బానిసై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ ఐ మహేష్ తెలి పారు. అయన తెలిపిన వివరాల ప్రకారం ఘన్పూర్ గ్రామానికి చెందిన కొక్కుల గంగాధర్ గత కొన్ని రోజులుగా మద్యనికి బానిసై జీవితం పై విరక్తి చెందాడు. ఈ క్రమంలో తన ఇంట్లో ఎవరు లేని సమయం చూసి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య కొక్కుల పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర మార్చురీకి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

దొంగతనం కేసులో ఇద్దరికి జైలు శిక్ష

నవతెలంగాణ-బాల్కొండ

బాల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బోదెపల్లి గ్రామంలో గత సంవత్సరం వరదకాలువలో రైతులు పెట్టుకొన్న మోటారు పంపును దొంగతనం చేసిన కేసులో బోదెపల్లి గ్రామానికి చెందిన నోముల వినయ్, ఎల్లప్పను బాల్కొండ ఎస్సై గోపి అరెస్ట్ చేసి వారి నుండి పంపు రికవరీ చేసి రిమాండ్ విధించారు. ఈ కేసులో పిపి రాజేశ్వరి సాక్షుల తరపున వాదనలు వినిపించారు. పూర్తి వాదనలు తరవాత బుధవారం ఆర్మూర్ జడ్జి వేముల దీప్తి ఈ కేసులో నిందితులైన వినయ్, ఎల్లప్పకు ఒక్క సంవత్సరం సాధారణ జైలు శిక్ష విధించారు.

హనుమాన్ ఆలయ శిఖర పునఃప్రతిష్ఠాపన



శిఖరం పునఃప్రతిష్ఠాపన కార్యక్రమంలో గ్రామస్తులు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని చిన్న తక్కడపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని తుప్‌దాల్ గ్రామంలో హనుమాన్ ఆలయంపై గల శిఖరం కోతుల బెడదతో కొన్ని రోజుల క్రితం విరిగిపోవడంతో ఖత్గావ్ మహరాజ్ మల్లికార్జునప్ప స్వామి సూచనల మేరకు గ్రామస్తులు బుధవారం హనుమాన్ ఆలయ శిఖరం పున్న ప్రతిష్ఠాపన చేసి ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యం సమర్పించి ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఖతగావ్ మహారాజ్ మల్లికార్జున అప్ప స్వామి, గ్రామ పెద్దలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల్లో పాల్గొన్న నాయకులు

నవతెలంగాణ-గాంధారి

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోహన్ నాయక్ బుధవారం నిర్వహించిన దసరా ఉత్సవాల్లో ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రామారెడ్డి మండల జడ్పిటిసి సభ్యుడు నా రెడ్డి మోహన్ రెడ్డి, నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజా ప్రతినిధులు మండలంలోని వివిధ పార్టీల నాయకులు ప్రజా ప్రతినిధులు తదితరులు దసరా ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోహన్ నాయక్ మాట్లాడుతూ దసరా ఉత్సవాల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలు సమిష్టిగా కృషి చేసి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకుందామని కోరారు.



దసరా ఉత్సవాల్లో కాంగ్రెస్ నాయకులు

సొసైటీ నుంచి
ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రం

గనవతెలంగాణ-సదాశివనగర్

సొసైటీ పరిధిలోని ప్రతి గ్రామంలో సొసైటీ తరపున కొనుగోలు చేద్దామని అడ్లూర్ ఎల్లారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాలకవర్గం నిర్ణయిం చింది. పాలకవర్గ సమావేశం సొసైటీ చైర్మన్ మర్రి సదాశివరెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమా వేశంలో వర్షాకాలం సీజన్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించడమైనది. మొత్తం 20 కేంద్రాలు ప్రారంభించాలని, సొసైటీ పరిధిలోని ప్రతి గ్రామంలో సెంటర్ ప్రారంభం చేయాలని తీర్మానించారు. ఈసారి వరి పంట మంచిగా ఉన్నందు వల్ల రైతులకు అధిక దిగుబడులు రాను న్నందున సుమారు 5 లక్షల పైచిలుకు సంచులు కొనుగోలు చేయుటకు సన్న ద్ధంగా ఉండాలని నిర్ణయించినట్లు సొసై టీ చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పశుపతి, డైరెక్టర్లు బక్కన్న గారి భాస్కర్, ఎడ్ల నర్సవ్వ, బత్తుల రాములు, ఉమామహేశ్వరరావు, నారాయణ రెడ్డి, గంగమణి, లక్ష్మాగౌడ్, రాజేందర్ రెడ్డి, సిబ్బంది సెక్రటరి భైరయ్య, లింగమూర్తి, భైరేష్, గంగరాజు, నవీన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సొసైటీ చైర్మెన్ మర్రి సదాశివరెడ్డి

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

నవతెలంగాణ-నసురుల్లాబాద్

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం సాధ్యమవుతుందని బాన్సువాడ మున్సిపల్ కౌన్సిలర్ కాసుల రోహిత్ తెలిపారు. బాన్సువాడ నియోజకవర్గంలోని బీర్కూర్ మండల కేంద్రంలో బుధవారం గడపగడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే చేపట్టబోయే సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించారు. అనంతరం బాన్సువాడ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కాసుల రోహిత్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తొలి సంతకం గా రెండు లక్షల రుణమాఫీని రైతులకు అందిస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్‌ను అందిస్తామని వివరించారు. రైతులు పండించిన ధాన్యానికి రూ.2500 మద్దతు ధర కాంగ్రెస్ ప్రభుత్వం కల్పిస్తుందని చెప్పారు. రైతులతో పాటు కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రత్యేక పథకాలను రూపొందించినట్లు వెల్లడించారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించి చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీర్కూర్ మండల అధ్యక్షుడు బోయిని శంకర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు యమ రాములు, అయినాల సాయిలు, సానిపు గంగారం, రాజప్ప పటేల్ , రవీ ,ఎస్టీ సెల్ అధ్యక్షులు రూప్ సింగ్,బోయిని గంగాధర్, మంద సాయిలు, ప్రభాకర్ గౌడ్, మాణిక్ , పుల్లేరి గంగాధర్ , కృష్ణ కుమార్, రషీద్, మహారాజ్ గంగారాం, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

ఘనంగా దేవి శోభయాత్రలు



దుర్గామాత శోభయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలో రామారెడ్డి తో పాటు ఆయా గ్రామాల్లో దేవీ నవరాత్రుల్లో భాగంగా బుధవారం దేవి శోభయాత్ర నిర్వహించారు. సాంస్కృతిక నృత్యాలతో, భజనలతో శోభయా త్ర అంగరంగ వైభవంగా కొనసాగింది. గాంధీ యువజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎంపిటిసి తుపాకుల రజిత రాజేందర్‌గౌడ్‌ను శాలువాతో సన్మానించారు.

కేసీఆర్‌ను మెజార్టీతో గెలిపించాలి

● విప్ గంపగోవర్ధన్



సభ్యులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండలంలోని సంగమేశ్వర్ గ్రామంలోని వివిధ కుల సంఘాల సభ్యులు, యువకులు చెందిన కాంగ్రెస్, బిజెపి పార్టీ లకు రాజీనామా చేసి ప్రభుత్వ విప్ గంప గోవ ర్ధన్, ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి సమక్షంలో బిఆర్ ఎస్ పార్టీలో చేరారు. గంప గోవర్ధన్ వారికి గులాబీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పెద్ద ఎత్తున బి ఆర్ ఎస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. రానున్న రోజుల్లో అం దరం కలిసి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అండగా నిలిచి భారీ మెజారిటీతో కేసీఆర్‌ను కామారెడ్డి నియోజకవర్గం నుండి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ పార్టీ జిల్లా అధ్య క్షులు ముజిబోద్దీన్, జడ్పీటీసీ తిర్మల్ గౌడ్, భిక్కనూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుం చాల శేఖర్, పార్టీ మండల అధ్యక్షులు మధుసు దనరావు, మండల రైతు సమన్వయ కమిటీ మాజీ అధ్యక్షుడు నర్సారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

నవతెలంగాణ-మద్నూర్/జుక్కల్

జుక్కల్ ఎమ్మెల్యే హనుమంతు షిండే నియోజకవర్గం నాయకులకు కలిసేందుకు బుధవారం బిచ్కుంద మండల కేంద్రంలో ఎమ్మెల్యే కార్యాలయంలో శుభాకాంక్షల సభ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యేకు దసరా శు భాకాంక్షలు తెలియజేసేందుకు బుధవారం మద్నూర్, డోంగ్లి ఇరు మండలాల నుండి సర్పంచులు ఎంపీటీసీలు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు భారీగా బిచ్కుందకు తరలివెళ్లి ఎమ్మెల్యేకు జంబి ఆకులను అందజేస్తూ దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. మద్నూర్ మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు సురేష్ ఆధ్వర్యంలో అలాగే డోంగ్లి మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు మధుకర్ పటేల్ ఆధ్వర్యంలో ఆయా మండలాలకు చెందిన సర్పంచులు నాయకులు తరలి వెళ్లారు.

జుక్కల్ : మండలంలోని ముప్పై గ్రామ పంచాయతీల సర్పంచులు బుధవారం జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ షిండేను కలిసి దసరా పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కలిసేందుకు వచ్చిన పార్టీ నాయకులతో మాట్లాడి క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సర్పంచులు నాగల్‌గావ్ కపిల్ పటేల్, లొంగన్ ఉషారాణి, చిన్న ఎడ్గి శాలిని బాయి, సావర్ గావ్ కిషన్, నాయకులు సదుపటేల్, శివాజీ పటేల్, శివరాజ్ దేశాయి, మాజీ సర్పంచులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు దసరా శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

c m y k

చదువులకు పేదరికం అడ్డు రాదు

- బాగా చదవి ఉన్నత శిఖరాలు చేరాలి

నవతెలంగాణ-లింగంపేట్

చదువులకు పేదరికం అడ్డు రాకూడదని ప్రతి ఒక్కరు బాగా చదవాలని హెల్పింగ్ బ్రిడ్జి ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధి కృష్ణకర్ అన్నారు. హెల్పింగ్ బ్రిడ్జ్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో లింగంపేట్ మండలంలోని కోమటిపల్లి గ్రామానికి చెందిన వేల్పుల విజయ అనే విద్యార్థినికి ఇంజనీరింగ్ ట్యూషన్ ఫీజుకు సంబంధించి 28 వేల రూపాయలను చెల్లించి దానికి సంబంధించిన రిసిప్టును బుధవారం అందజేశారు. చదువుకోవడానికి బీదరికం అడ్డుకాకూడదని ప్రతి ఒక్కరు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.



విద్యార్థికి ఆర్థిక సహాయం అందజేస్తున్న హెల్పింగ్ బ్రిడ్జ్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధులు

హెల్పింగ్ బ్రిడ్జ్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ తరపున అమ్మాయి చదువుల నిమిత్తం అరుణ్ కుమార్, సుజితకృష్ణకర్, నిఖిల్ కుమార్, ఎంపీటీసీ హాజి నాయక్, మురళి, జూకంటి అనిల్, రాఘవేందర్ పటేల్, వజీర్ రాకేష్ , స్వామి, ఆనంద్, రామచంద్రం ల వారి సహాయంతో ఆర్థిక సహాయం అందించినట్టు తెలిపారు.

ఇప్పటివరకు చాలామంది విద్యా ర్థులకు వారి చదువుల కోసం ఆర్థిక సహాయం చేశామని ముున్ముందు కూడా ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేస్తామని తెలిపారు. ప్రతి విద్యార్థి బాగా కష్టపడి చదివి ఉన్నత స్థాయికి వెళ్తేనే వారికి సరైన గుర్తింపు ఉంటుందని వారి అభివృద్ధి పథంలో నడుస్తారని తెలిపారు. ముున్ముందు హెల్పింగ్ బ్రిడ్జి ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ద్వారా వీలైనంత వరకు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపా రు. ఈ కార్యక్రమంలో హెల్పిం గ్ బ్రిడ్జి ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధులు శ్రీకాంత్, రమేష్ రెడ్డి, శ్రీశైలం, కిషోర్, నవీన్, వెంకటస్వామి, సుభాష్ గౌడ్, సంతోష్ కుమార్, మహిపాల్‌రెడ్డిలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత


కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన యాదవరెడ్డి

నవతెలంగాణ-రాజంపేట్

రాజంపేట్ మండలంలోని తలమడ్ల గ్రామంలో మంగళవారం మరణించిన మేరే రాములు కుటుంబానికి షబ్బీర్ అలీ ఫౌండేషన్ ద్వారా బుధవారం మండల అధ్యక్షుడు యాదవ రెడ్డి 5000 రూపాయలు అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రావణ్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్ శివకుమార్, మాజీ ఎంఎంటీసీ నరసింహులు, సురేష్, కుమ్మరి రాములు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారం కోసం వచ్చే దరఖాస్తుల పరిశీలించాలి

మొదిటిపేజీ తరువాయి

ఈ సమావేశంలో కమిటీ ప్రతినిధులు పీ.యాదిరెడ్డి, అదనపు జిల్లా ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్, ఎన్.పద్మశ్రీ, డీపీఆర్ఓ, బీ. రవికుమార్, జిల్లా ఇన్ఫర్మేటిక్ అధికారి, ఎన్.ఐ.సి, బీ. ధర్మానాయక్, ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్, (సీబీసీ) తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో కమిటీ పనితీరుపై కూలంకషంగా చర్చించడం జరిగినది. ఇప్పటివరకు ఎన్నికల ప్రచారం నిమిత్తం వచ్చిన దరఖాస్తులు, వాటిని పరిశీలించిన విధానం, జారీ చేసిన అనుమతులు తదితర అంశాలను చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు.

ఎన్నికల ప్రచారం కోసం వచ్చే దరఖాస్తులకు సంబంధించి వాటిలోని అంశాలు, వీడియోలను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఎలాంటి అభ్యంతరం లేని వాటికే అనుమతులు మంజూరు చేయాలని అన్నారు. ఉర్దూ, హిందీ, ఆంగ్ల మాధ్యమాలు సహా అన్ని ప్రధాన దిన పత్రికలు, లోకల్ పేపర్స్, ఈవెనింగ్ ఎడిషన్స్ ప్రతి రోజు పరిశీలిస్తూ ఎన్నికల ప్రచార ప్రకటనలు, పెయిడ్ న్యూస్, ఎన్నికల ప్రవర్తన నియమావళికి భిన్నంగా అభ్యంతరక రీతిలో ఉండే అంశాలతో కూడిన న్యూస్ గుర్తించాలని సూచించారు. పేస్ బుక్, ట్విట్టర్, వాట్స్ యాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలలో వచ్చే ఎన్నికలతో ముడిపడిన అంశాలను అనునిత్యం నిర్విరామంగా నిశిత పరిశీలన జరపాలని, అవసరమైన వాటిని తగిన రీతిలో రికార్డు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇంకా సస్పెన్సే..

మొదిటిపేజీ తరువాయి

16 మందిలో ఎవరికి టికెట్ ఇవ్వట్లే ?

బాన్సువాడ నియోజకవర్గం నుంచి కాంగ్రెసు పార్టి టికెట్ కోసం 16 మంది దరఖాస్తులు చేసుకున్న విసయం తెలిసిందే. కానీ వారిలో ఎవరికి టికెట్ అదిష్టానం ఇవ్వటం లేదనే సమచారం. దీంతో కొత్తవారు ఎవరు వస్తారో అని కార్యకర్తలు ఆరా తీస్తున్నారు. దీంతో దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు నిరాశలో ఉన్నట్లు తెలుస్తుంది.

బాన్సువాడకు గట్టి లీడర్ కావాల్సిందే..

బాన్సువాడలో పోచారం శ్రీనివాస్‌రెడ్డిని ఢీకొట్టాలంటే బలమైన అభ్యర్థి కావాలని కాంగ్రెస్ కార్యకర్తలు కోరుతున్నారు. దీంట్లో భాగంగానే అధిష్టానం బలమైన అభ్యర్థి కోసం ప్రయత్నాలు చేస్తున్నట్టు వినికిడి.

50 వేలు పలికిన దుర్గామాత లడ్డు


లడ్డును అందజేస్తున్న కమిటీ సభ్యులు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని పోతాయిపల్లి గ్రామంలో దుర్గ అసోసియేషన్ వారు 11వ వార్షికోత్సవం దుర్గానవరాత్రులు పూర్తి చేసుకొని చివరి రోజు మంగళవారం రోజు రాత్రి లడ్డు వేలంపాట నిర్వహించగా రూ.50 వేలు పలికినట్టు నిర్వహకులు తెలిపారు. పోతయ్య పల్లి గ్రామానికి చెందిన తోట ప్రతిభ అశోక్ దంపతులు లడ్డు వేలంపాటలో పాల్గొని 50 వేలకు కైవసం చేసుకున్నారు. అనంతరం వేడుకగా దుర్గామాత నిమజ్జన శోభయాత్ర నిర్వహిచారు.

ఆరు హామీల కరపత్రాల పంపిణీ

నవతెలంగాణ-రాజంపేట్

రాజంపేట్ మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఆరు హామీ పథకాల కరపత్రాలను గడపగడపకు పంపిణీ చేసినట్టు మండల అధ్యక్షుడు యాదవ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి అధికారంలోకి వస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాజంపేట్ మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు కే వీరన్న, కే బాలకిషన్, రాజంపేట్ మండల యూత్ అధ్యక్షులు అంకం కృష్ణారావు, సుధాకర్‌రెడ్డి, అక్బర్, పట్టణ అధ్యక్షులు రంగ గంగాధర్ గౌడ్, యువజన అధ్యక్షులు షాదుల్, మేకల నరసింహులు, బిసి నాయకులు సిద్ధిరాములు, పిట్ల సత్యం, దేవయ్య, బెస్త చంద్రం, ఎన్ఎస్‌యుఐ మండల శాఖ అధ్యక్షులు షేక్ జమీల్, మైనార్టీ నాయకులు ఎండి షాదుల్, రహమత్ ఆఫ్ రోజ్, ఫిరోజ్ అమాన్, గ్రామ కార్యదర్శి వాజహత్, ఎస్సీ నాయకులు గ్యార బాలరాజ్ భీమయ్య, బాగయ్య, గంగయ్య, బోయిన్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.


హామీ పథకాల కరపత్రాలను పంపిణీ చేసిన మండల అధ్యక్షుడు యాదవరెడ్డి

సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయ్యాలి



నవతెలంగాణ-మద్నూర్


ఈనెల 30న తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ జుక్కల్ నియోజకవర్గం ఎన్నికల ప్రచార నిమిత్తం జుక్కల్ మండలంలోని జుక్కల్ చౌరస్తాకు మధ్యాహ్నాం 12 గంటలకు రానున్న దృష్ట్యా పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బస్సీపటేల్ బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మద్నూర్ మండలానికి చెందిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, బిఆర్ఎస్ మహిళా సంఘం నాయకులు, బిఆర్ఎస్ కుటుంబ సభ్యులు, కార్యకర్తలు ప్రజలు అత్యధికంగా పాల్గొని ఎన్నికల సభను విజయవతం చేయాలని కోరారు.

మహిళకెన్నడు అవకాశం..?

మొదిటిపేజీ తరువాయి

యుగంలో రాజకీయాల్లో మాత్రం వారికి అంతగా ప్రాధాన్యం లభించడం లేదనే చెప్పవచ్చు.

కామారెడ్డి జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో అత్యధికంగా మహిళా ఓటర్లే ఉన్నారు. నాలుగు నియోజకవర్గాల్లో ఆయా పార్టీల అభ్యర్థులను గెలిపించడంలో మహిళా ఓట్లే కీలకంగా మారనున్నాయి. వారు తలుచుకుంటే అభ్యర్థుల గెలుపోటములపై ప్రభావం చూపగలరు. ఇక ముందు జరిగే ఎన్నికల్లో తమకు తగు ప్రాధాన్యం ఇవ్వాలని మహిళల నుంచి డిమాండ్ వినిపిస్తోంది. ఎప్పుడు ఎన్నకలు వచ్చినా.. రాజకీయ పార్టీలు మహిళల జనాభా, ఓటర్లకు అనుగుణంగా రాజకీయ అవకాశాలు కల్పించడం లేదన్న అసంతప్తిని కూడా వ్యక్తమవుతోంది.



బాన్సువాడ నియోజకవర్గం

బాన్సువాడ నియోజకవర్గం 1952లో ఏర్పడగా అత్యధికంగా ఎమ్మెల్యేగా పోచారం శ్రీనివాస్ రెడ్డి గెలుపొందగా మహిళ ఎమ్మెల్యేలుగా లక్ష్మిబాయి, సితకుమారి గెలుపొందారు. ప్రస్తుతం బాన్సువాడ నియోజకవర్గంలో 9 మండలాలు ఉన్నాయి ఇందులో కోటగిరి, చందూర్, నసురుల్లాబాద్, పొతంగల్, బాన్సువాడ బీర్కూర్ మోస్రా, రుద్రూర్, వర్ని మండలాలు ఉన్నాయి. నియోజకవర్గంలో ఒక లక్ష 85 వేల ఓట్లు ఉన్నాయి. బాన్సువాడ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించారు. ప్రస్తుతం ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి బి ఫామ్ పోచారం శ్రీనివాస్ రెడ్డికి ఇవ్వగా కాంగ్రెస్ పార్టీ, బీజేపీ, వామపక్ష పార్టీలు ఇప్పటికి అభ్యర్థుల పేర్లను ప్రకటించలేదు. మహిళ ఓట్లను సద్వినియోగం చేసుకొని మహిళలను మరచిపోతున్నారని మహిళలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రధాన పార్టీలు మహిళలకు అసెంబ్లీ టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ




నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని పోసానిపేట్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు చాకలి నరేందర్ తండ్రి మృతి చెందడంతో బుధవారం కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి, గ్రామ సర్పంచ్ గీ రెడ్డి మహేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు నా రెడ్డి శ్రీనివాస్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

అభ్యర్థుల ఖరారుతో వేడెక్కుతున్న బాల్కొండ

- ప్రచారంలో దూసుకుపోతున్న గెలుపు గుర్రాలు
- భారీ సభలు వాహనాల ర్యాలీలు పార్టీలలో చేరికలు
- ఎన్నికలవేళ జోరందుకున్న రాజకీయం




వేముల ప్రశాంత్‌రెడ్డి


ముత్యాల సునీల్‌కుమార్‌రెడ్డి

నవతెలంగాణ-బాల్కొండ

జిల్లాలోనే కాకుండా రాష్ట్రస్థాయిలో బాల్కొండ నియోజకవర్గానికి చాలా ప్రాముఖ్యత ఉంది. ఇక్కడి నుండి గెలిచిన ఎమ్మెల్యేలు.. ప్రభుత్వ క్యాబినెట్‌లో కీలక పదవులు చేపట్టారు. ప్రస్తుతం 2024 అసెంబ్లీ ఎన్నికలలో ప్రధానంగా మూడు పార్టీల నుంచి అభ్యర్థులు ఖరారు కావడంతో ప్రచారం హోరెత్తుతుంది. బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వేముల ప్రశాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ముత్యాల సునీల్ కుమార్, బిజెపి అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మ బరిలో నిలుస్తున్నారు.

ప్రస్తుతం బిఆర్ఎస్ అభ్యర్థి వేముల ప్రశాంత్ రెడ్డి క్యాబినెట్ లో రాష్ట్ర రోడ్లు భవనాలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రిగా కొనసాగుతున్నారు. వేముల ప్రశాంత్ రెడ్డి గత రెండు పర్యాయాలుగా ఎమ్మెల్యేగా గెలిచి హెట్రిక్ దిశగా ముందడుగులు వేస్తున్నారు. ప్రజలకు తాను స్వయంగా చేసిన విశేష కృషి, కరోనా సమయంలో సొంత నిధులతో ప్రభుత్వ ఆసుపత్రులలో ఆక్సిజన్ ప్లాంట్‌లు, లాక్ డౌన్ సమయంలో నియోజకవర్గంలో పర్యటన చేసి కోవిడ్ బాధితులను ఆదుకోవడం, గ్రూప్ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగుల కోసం సొంత ఖర్చుతో కోచింగ్ సెంటర్, భోజన వసతి , గ్రూప్ పుస్తకాలను అందించినట్టు ప్రచారంలో పార్టీ నాయకులు ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. 50 ఏళ్లలో జరగని అభివద్ధి బిఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిది సంవత్సరాలలో చేసి చూపెట్టిందని, అభివద్ధి మీ కళ్ళముందే ఉందని ప్రజలు గమనించాలని ప్రచారం చేసుకుంటూ వెళ్తున్నారు.

ఇక కాంగ్రెస్ అభ్యర్థిగా ఊహించనిరీతిలో అభ్యర్థుల మొదటి జాబితాలోనే పార్టీ అభ్యర్థిగా ముత్యాల సునీల్ కుమార్ తేర పైకి వచ్చారు. సునీల్ కుమార్ బిజెపి టికెట్ ఆశించి బంగపడ్డారు. దాంతో మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డితో ఉన్న సన్నిహిత్యంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా టికెట్ ఖరారు చేసుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలలో బీఎస్పీ పార్టీ నుండి పోటీ చేసి రెండవ స్థానానికి పరిమితమయ్యారు. నియోజక వర్గంలో ఆపదలో ఉన్న వారికి ఆర్థిక సహాయం అందిస్తూ మంచి పేరు సంపాదించారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇటీవల రాహుల్ గాంధీ నియోజకవర్గ పర్యటనలో భాగంగా భారీగా జన సమీకరణ చేసి ప్రత్యర్థుల గుండెల్లో రైలు పరిగెత్తించారని వినికిడి. గట్టి పోటీ ఇవ్వగలరని కార్యకర్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

బిజెపి నుండి ఏలేటి మల్లికార్జున్ రెడ్డి పోటీ చేస్తారని అనుకున్న సమయంలో బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థిగా మల్లికార్జున్ రెడ్డి తల్లి ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే అన్నపూర్ణమ్మ పేరు పార్టీ ఖరారు చేసింది. అన్నపూర్ణమ్మ గతంలో ఆర్మూర్ ఎమ్మెల్యేగా రెండు పర్యాయాలు కొనసాగారు. చాలా రాజకీయ అనుభవంతో బాల్కొండ నియోజకవర్గంలో అడుగు పెట్టిన మొదటి సారి దాదాపు 500 కార్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఇలా ప్రత్యర్థులు తమదైన శైలిలో ఎత్తుగడలు వేసుకుంటూ నియోజకవర్గంలో ప్రచారంలో దూసుకుపోతున్నారు.

హోరెత్తిస్తున్న ప్రచార రథాలు

ప్రధానంగా మూడు పార్టీల నుంచి అభ్యర్థులు ఖరారు కావడంతో ప్రచార రథాలు నియోజకవర్గంలో హోరెత్తిస్తున్నాయి. వాహనాలను ప్రత్యేకంగా సిద్ధం చేయించి.. అభ్యర్థులపై ప్రత్యేక పాటలు సిద్ధ చేసుకొని గ్రామ గ్రామాన తిరుగుతూ అభ్యర్థుల తరఫున ప్రచారం చేపడుతున్నాయి.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

- మాజీ మంత్రి షబ్బీర్‌అలీ


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి షబ్బీర్‌అలీ

నవతెలంగాణ-భిక్కనూర్

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని మాజీ మంత్రి షబ్బీర్ అలీ అన్నారు. బుధవారం మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన ఇతర పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 6 గ్యారంటీ పథకాలను తక్షణమే అమలు చేస్తామని ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ తక్షణమే అమలు చేస్తుందని తెలిపారు. సాధ్యం కానీ హామీలతో సీఎం కేసీఆర్ ప్రజలను మోసం చేస్తున్నారని, మరోసారి వారికి అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని అమ్ముకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమ్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకన్న గారి బాగారెడ్డి, బస్వాపూర్ గ్రామ శాఖ అధ్యక్షులు సిద్ధిరాములు, నాయకులు శివకృష్ణమూర్తి, యాదగిరి, జీవన్, మల్లేష్, రవి, చంద్రం తదితరులు ఉన్నారు.

31న సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-జుక్కల్

జుక్కల్ మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ సుర్నార్ యశోదా నీలుపటేల్ అధ్యక్షతన ఈ నెల 31వ తేదీనా నిర్వహించనున్నట్టు ఎంపిడీవో నరేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశం మండల పరిషత్ సమావేశ మందిరంలో అక్టోబర్ 31వ తేదిన ఉదయం 11 గంటలకు నిర్వహించను న్నామని, అంతకు ముందు సమావేశం కోరం సభ్యులు లేక వాయిదా పడినట్టు పేర్కొన్నారు. కావున గ్రామ సర్పంచులు, ఎంపిటిసిలు తప్పక రావాలని, వివిధ శాఖల అధికారులు తమ నివేదికలను ఒక రోజు ముందుగా ఎంపిడీవో కార్యాలయ అధికారులకు ఇవ్వాలని, సమావేశానికి జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు రానున్నారని, మండల స్థాయి అధికారులు సమావేశానికి తప్పక రావాలని, లేని యెడల శాఖ పరమైన చర్యలు తప్పవని ఎంపిడీవో తెలిపారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు


పురస్కారం అందజేస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-సదాశివనగర్

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ప్రతిభా పురస్కారాలు ఎంతో దోహదపడుతాయని తిర్మన్ పల్లి గ్రామ వాసి ప్రభుత్వ ఉపాధ్యాయులు మార బాల్ రెడ్డి అన్నారు. విద్యార్థులు విద్యావంతులై అన్ని రంగాల్లో ముందుకు రావాలన్నారు. పదవ తరగతి, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను బుధవారం అందజేశారు. మార అఖిల, ఈగ స్పందన, నారెడ్డి దీప్తి, చాకలి అర్చన లకు సర్పంచ్ బాల్ రెడ్డి, ఎం పి టీ సి భైరవ రెడ్డి, ఉపసర్పంచ్ ప్రసాద్, వీడిసి చైర్మన్ బాస్కర్ రెడ్డి ల చేతుల మీదుగా అందజేసినారు. గ్రామ పెద్దలు ప్రతిభా పురస్కార అవార్డు విజేతలను అభినందించారు. విద్యార్థులు ఉత్సాహంగా మరిన్ని ఫలితాలు సాధించడానికి ఇలాంటి ప్రతిభ పురస్కారాలతో బాల్‌రెడ్డి పోత్సహించడం హర్షనీయమని అన్నారు.

ఉద్యోగులుగా గుర్తించినట్టా.. లేదా?

- వేతనాలు చెల్లించేదెప్పటి నుంచి..?
- దిక్కుతోచని స్థితిలో వీఆర్ఏలు



నవతెలంగాణ-రామారెడ్డి

తెలంగాణ ప్రభుత్వం ఆగమేఘాల మీద వీఆర్ఏలను పదోన్నతి కల్పిస్తూ, రెవెన్యూ శాఖ నుండి, వివిధ శాఖలకు, విద్యార్హతను బట్టి వివిధ హెూదాల్లో భర్తీ చేసి, వేతనాన్ని కూడా ప్రకటించింది. అంతవరకు బాగానే ఉంది. అసలు విషయానికొస్తే, ప్రభుత్వ ఉద్యోగిగా గుర్తిస్తూ ప్రభుత్వం చేసిన ప్రకటనతో పాటు బాధ్యతలను అప్పగించినందుకు సంతోషపడాలో? ప్రభుత్వ ఎంప్లాయ్ ఐడి ఇవ్వకుండా, వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తుండటంతో బాధ పడాలో తెలియని దుస్థితి నెలకొంది.

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 1429 మంది వీఆర్ఏలు పదోన్నతిపై వివిధ శాఖల్లో కామారెడ్డి జిల్లాలో దాదాపు 850 మందిని సర్దుబాటు చేసి, మిగతా 579 మందిని రాష్ట్రంలో వివిధ జిల్లాలకు సర్దుబాటు చేశారు. స్త్రీ పురుషులని చూడకుండా ములుగు, సూర్యాపేట, సిద్దిపేట్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు సర్దుబాటు చేయగా, కుటుంబాలతో కలిసి ఆ ప్రాంతంలో నివాసం ఉండడానికి వెళ్లారు. అయితే విధుల్లో చేరిన తర్వాత ఉద్యోగిగా గుర్తించకుండా, వెట్టి చాకిరి చేయిస్తూ, జీతాలు కూడా ఇవ్వటం లేదని వీఆర్ఏలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గదుల అద్దెలు చెల్లిస్తూ, రోజువారి ఖర్చులను భరిస్తూ, అప్పులు చేయవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆగస్టులో 1 తేదీ నుండి 9వ తేదీ వరకు మాత్రమే వీఆర్ఏల వేతనాలను చెల్లించి, 10వ తేదీ నుండి నేటి వరకు వేతనాలను చెల్లించక పోవడంతో ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాలు అప్పుచేసి బతుకమ్మ, దసరా పండగలు చేసుకున్న పరిస్థితి నెలకొందని వాపోతున్నారు.

చిరు ఉద్యోగులుగా, ములుగు తదితర జిల్లాల్లో జీవించడం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని, ప్రభుత్వం వెంటనే స్పందించి, ఇతర ఉద్యోగులను జోన్ వైజ్ గా పరిగణిస్తున్నట్లు, కామారెడ్డి జిల్లా వీఆర్ఏలను రాజన్న సిరిసిల్ల జోన్ పరిధిలో సర్దుబాటు చేసి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, వెంటనే వేతనం చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.